సాక్షి నారాయణపేట

ఆదివారం । 12 । జనవరి । 2025



వైభవంగా గిరి ప్రదక్షిణలు
అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు.
వివరాలు 10లో ▸



తెలంగాణ జోరు
జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలుర జట్టు జోరు కొనసాగుతోంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0/15.0
ఉదయం, రాత్రి వేళలో చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.


యువతంత్రం.. స్ఫూర్తిమంత్రం

సండే స్పెషల్

నేడు జాతీయ యువజన దినోత్సవం

- సామాజిక సేవలో రాణిస్తున్న యువత
- రక్తదానం, అన్నదానంతో పాటు ప్రగతిలో మమేకం

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఆశించకుండా మనల్ని మనమే సంస్కరించుకోవాలని అడుగు ముందుకు వేస్తున్నారు కొంతమంది యువకులు. రక్తదానం, అన్నదానం, విద్యాదానం.. ఇలా అనేక సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ పలువురికి స్ఫూర్తిని రగిలిస్తున్నారు. నేడు వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదర్శ యువజన సంఘాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



ప్రాణదాతలు

నవాబుపేట: నవాబ్‌పేటకు చెందిన స్వామి వివేకానంద సేవా సమితి ప్రతిఏటా వివేకానంద, నేతాజీ, అంబేద్కర్ జయంతులతోపాటు ఇతర దేశ నాయకుల జన్మదినాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తోంది. ఇప్పటి వరకు 11 సార్లు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి.. వేలాది యూనిట్ల రక్తం సేకరించారు. గ్రామస్తుల ప్రోత్సాహంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పలుమార్లు ఉత్తమ అవార్డు అందుకుంది. 1995లో 13 మంది సభ్యులతో ఏర్పడిన ఈ సంఘం 62 మంది సభ్యులతో కొనసాగుతుంది. స్వచ్ఛ భారత్, ఈచ్ వన్- టీచ్ టెన్ నినాదంతో ఎయిడ్స్‌పై విస్తృతంగా ప్రచారం చేస్తూ అందరి మన్ననలు పొందుతోంది. పండగల సందర్భాల్లో గ్రామాన్ని చూడముచ్చటగా అలంకరించడం ఈ సమితి సభ్యులు కొనసాగిస్తున్నారు. గతేడాది దాతల సహకారంతో ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సమయంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.



నవాబ్‌పేట, కొండాపూర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

అందుబాటులో ఉంటాం..



రక్తదానం కోసం సేవా సంఘంలో 10 మందికిపైగా యువకులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. ఎవరికి రక్తం అవసరం వచ్చినా రక్తదానం చేసేందుకు ముందుంటాం. ఎక్కడ ఆస్పత్రిలో ఉన్నా సొంత ఖర్చులతో వెళ్లి రక్తదానం చేస్తాం.
– శివాజీ, నవాబుపేట

విద్యార్థులకు తోడ్పాటు..

అలంపూర్: పట్టణానికి చెందిన స్వామి వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు విద్య, వైద్యం, ఉపాధి, క్రీడలు వంటి వాటిలో ఆయా వర్గాలకు తమవంతుగా తోడ్పాటునందిస్తున్నారు. మొదట 15 మందితో ఏర్పాటు చేసిన సంఘంలో ప్రస్తుతం 300లకుపైగా కొనసాగుతున్నారు. అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో దాతల సహకారంతో రూ.3 లక్షలు వెచ్చించి షెడ్డు నిర్మించారు. అలాగే ఆస్పత్రిలో టీవీ, రూ.లక్షతో బాడీ ఫ్రీజర్ ఉచితంగా అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం, మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. వేసవిలో చలివేంద్రంతోపాటు మజ్జిగా పంపిణీ కేంద్రాల ఏర్పాటు, జోగుళాంబ ఆలయంలో మహాశివరాత్రి,దసరా, అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ, ఆలయాల హుండీ లెక్కింపులో స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటితోపాటు సమాజం చైతన్యం కోసం ఎన్నికల సమయాల్లో ఓటు హక్కుపై అవగాహన, యోగా, ఉద్యోగాల సాధన కోసం యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు.



అలంపూర్‌లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు (ఫైల్)

నిరంతరాయంగా..



స్వామి వివేకానందుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. యువత భవిష్యత్‌కు, వ్యక్తిత్వ వికాసానికి స్వామి వివేకానందుడు స్ఫూర్తి. అందరి సహకారంతో సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలి.
– వెంకటేష్‌యాదవ్, స్వామి వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు, అలంపూర్

హెల్పింగ్ హ్యాండ్స్

జడ్చర్ల టౌన్: ఉత్తరాఖండ్‌లో బీభత్సం సృష్టించిన వరదలు మండలంలోని గంగాపురంలో హెల్పింగ్ హ్యాండ్స్ యువజన సంఘం ఏర్పాటుకు బీజ్యం వేశాయి. ఆరు మంది యువకులు సంఘంగా ఏర్పడి.. గ్రామంలో విరాళాలు సేకరించి అప్పటి కలెక్టర్‌కు అందజేశారు. సంఘం ప్రారంభించినప్పటి నుంచి స్ఫూర్తిగొలిపే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. అలాగే గ్రామ పెద్దలు, యువజన సంఘాల సహకారంతో క్రీడామైదానం, గ్రంథాలయం ఏర్పాటుకు కృషి, తద్వారా ఆర్మీ, పోలీసు ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారికి శిక్షణ పొందేలా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించకున్నారు.



2013లో గ్రామంలో విరాళాలు సేకరిస్తున్న సభ్యులు

❒ హెల్పింగ్ హ్యాండ్స్‌కు అనుబంధంగా గ్రామస్తులను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు చేసేందుకు హెల్పింగ్ హార్ట్స్ పేరుతో మరో సంఘం ఏర్పాటు చేశారు. సంఘంలో ప్రస్తుతం 72 మంది సభ్యులు ఉండగా.. 100 మందిని చేర్చాలని ప్రయత్నిస్తున్నారు. వీరు ప్రతినెలా రూ.100 చొప్పున జమ చేస్తూ వాటి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
మొదట అనాథలైన పదో తరగతి విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు వంటివి అందిస్తున్నారు.

ఆ వరదలతో ఆలోచన..



ఉత్తరాఖండ్ వరదలు మాలో ఆలోచన రేకెత్తించాయి. అందుకే 6 మందితో యువజన సంఘం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించాం. ఇప్పుడు సభ్యుల సంఖ్య 30కి చేరింది. వివిధ రంగాల్లో మేమంతా నిమగ్నమైనా సంక్రాంతి, దీపావళి, లక్ష్మీచెన్నకేశవస్వామి జాతరకు తప్పనిసరిగా అందరం కలుసుకొని.. ఏడాదిపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అలాగే హెల్పింగ్ హార్ట్స్ పేరుతో మరో సంఘం ఏర్పాటు చేశాం. దానిలో గ్రామస్తులను భాగస్వాములు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నాం.
– క్రాంతికుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్, యువజన సంఘం సభ్యుడు

సమాజ సేవలో 50 ఏళ్లు



రక్తదానం చేస్తున్న మరికల్ యువక మండలి సభ్యులు(ఫైల్)

మరికల్: సమాజం తనకు ఏమి ఇచ్చింది అని కాకుండా.. సమాజానికి నేను ఏం చేశాను అన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది మరికల్ యువక మండలి. తన 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో రాజకీయలకు సంబంధం లేకుండా ఎన్నో ఒడిదుడులను అధిగమించి సొంత భవనం నిర్మించుకోవడమే కాకుండా.. చేసిన ప్రజా సేవలకు ఉన్నతాధికారుల నుంచి అనేక అవార్డులు, ప్రశంసలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమాజ సేవలో భాగంగా ఆర్థికంగా చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం.. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మరికల్‌లో గతంలో నిర్వహించిన ఉద్యోగ పోటీ పరీక్షలకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను బైక్‌లపై పరీక్ష కేంద్రానికి చేర్చి పలువురితో శెభాష్ అనిపించుకున్నారు.

చరిత్రలో నిలబెడతాం..



స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ కోసం ఏర్పాటు చేసిన మరికల్ యువక మండలి సేవలను ముమ్ముందు కొనసాగిస్తాం. నా కన్నా ముందు 13 మంది అధ్యక్షులు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భవిష్యత్‌లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి.. మరికల్ పేరును చరిత్రలో నిలబెడతాం.
– శ్రీకాంత్‌రెడ్డి, నూతన యువక మండలి అధ్యక్షుడు, మరికల్

ఆరోగ్య ప్రదాతలు..



తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

ఆత్మకూర్: వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కి చెందిన డాన్స్ మాస్టర్ బాలు, మ్యాడం శ్రీను, ల్యాబ్ టెక్నీషియన్ రాజేష్ తదితరులు స్వామి వివేకానంద సేవా సమితిని నెలకొల్పి వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా తలసేమియా బాధితులకు అండగా రక్తదాన శిబిరాలు, నేత్రం ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆరోగ్య ప్రదాతలుగా నిలుస్తున్నారు.

మా అదృష్టం..



యువతను చెడు అలవాట్లకు దూరం చేస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నాం. ఇది వరకు రక్తదాన, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూ.. విద్యా ర్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నాం. తలసేమియా బాధితులకు రక్తదానం చేసి అండగా నిలుస్తున్నాం. సేవా కార్యక్రమాలు చేపట్టడం మా అదృష్టంగా భావిస్తున్నాం.
– బాలు, సేవా సమితి అధ్యక్షుడు, ఆత్మకూర్

సామాజిక రుగ్మతలపై చైతన్యం

కల్వకుర్తి రూరల్: యువతకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన, సామాజిక రుగ్మతలపై ప్రజలను చైతన్యవంతం, నిరుపేదల ఆకలి తీర్చడంతోపాటు పాత దుస్తువులను అందించే కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తోంది కల్వకుర్తికి చెందిన స్వామి వివేకానంద సేవా సంస్థ. 12 సంవత్సరాలుగా వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఎందరిచేతో ప్రశంసలు, అభినందనలు అందుకుంటూ ముందుకు సాగుతున్నారు సంస్థ సభ్యులు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటడం, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు యోగా, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించడం, అవయవ దానం, రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అవయవ దానంపై అవగాహనతోపాటు బృందం అధ్యక్షుడు శివ లివర్‌ను దానం చేసి ఒకరి ప్రాణం నిలిపారు. అలాగే సంస్థ సభ్యులు వినూత్నంగా ఆలోచించి శుభకార్యాల్లో మిగిలిన అన్నంతో నిరుపేదల ఆకలి తీరుస్తూ.. ఆహారం విలువను చాటిచెబుతున్నారు. ప్రధానంగా యువత చెడు అలవాట్లకు బానిసగా మారకుండా.. డ్రగ్స్, మద్యపానం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ.. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు.



పేదలకు పాత దుస్తులు పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

ఆనందంగా ఉంది..



స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి యువతను చైతన్యపరిచి సమాజానికి మార్గదర్శకులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో 12 ఏళ్లుగా ముందుకు సాగుతున్నాం. చాలామంది యువత తమ తోటి వారికి సహకారం అందించేలా చేయడం ఆనందంగా ఉంది.
– శివకుమార్, సంఘం అధ్యక్షుడు, కల్వకుర్తి

దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత మోదీదే

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



దండు గ్రామంలో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మక్తల్: భారతదేశాన్ని మొదటిస్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీదేనని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం పుర పరిధిలో రూ.15.38 కోట్లతో తాగునీటి ట్యాంకులు, సీసీ రహదారులు తదితర అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. పట్టణంలోని 2, 13, 16 వార్డుల్లో సీసీ రహదారి నిర్మాణం, 8వ వార్డులో వాటర్‌ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి ఇబ్బందులు తీరుస్తానని, గ్రామాలకు రోడ్లు వేయించి రాకపోకల అవస్థలు తొలగిస్తానని హామీ ఇచ్చారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే, ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు జరుగుతామని తెలిపారు. కేంద్ర నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి మౌలిక వసతులు కల్పిస్తానని వివరించారు. అందరికి విద్యను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దండు పాఠశాలలో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైతేనే దేశం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని చెప్పారు. అనంతరం ఎంపీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్‌నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొండయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిల, పార్టీ అధికార ప్రతినిధి శంకరోళ్ల రవి కుమార్, కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, ప్రసన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి, డీఈ మల్లేష్, ఏఈ ప్రవీణ్‌రెడ్డి, కర్నిస్వామి, సోంశేఖర్‌గౌడ్, శ్రీకాంత్, రాజుగౌడ్, మల్లికార్జున్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, పీకే నర్సింహ పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- అదనపు కలెక్టర్ బెన్ షాలం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలం

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కొత్త పథకాల లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలం సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 10న రాష్ట్ర సచివాలయంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం సీఎం సమావేశ ఎజెండాతో శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీఓలు, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని.. మీ పనితీరు కొలమానమని అన్నారు. ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం రోజున ప్రభుత్వం పేదల కోసం కొన్ని ముఖ్యమైన పథకాలను ప్రారంభించబోతోందని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాలుగు పథకాల అమలుపై జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామసభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో మండలానికి నలుగురు మండలస్థాయి అధికారులు, గ్రామస్థాయిలో రెవెన్యూ, ఏఈఓ, పంచాయతీ కార్యదర్శులతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 20 వరకు ఆయా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో నాలుగు పథకాల అమలుకు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారు చేయాలన్నారు. మండలస్థాయి అధికారులు ఏరోజుకారోజు తమ పరిధిలోని నాలుగైదు గ్రామాల్లో సిబ్బంది చేపడుతున్న క్షేత్రస్థాయి పరిశీలనను పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ నెల 20 నుంచి 24 వరకు ఆయా గ్రామాలు/ వార్డుల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ముసాయిదా జాబితాను ప్రకటించాలని సూచించారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామం చేయాలని.. ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించి విచారణ అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుందన్నారు. ఇదే సమయంలో అర్హులైన లబ్ధిదారుల డేటా ఎంట్రీ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలన్నారు. కొత్త పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు జాబితా తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, ఆర్డీఓ రామచంద్ర నాయక్, జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి, డీఆర్డీఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, డీపీఓ కృష్ణ, ఇతర జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి



వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రాంచందర్‌నాయక్

నారాయణపేట: కలెక్టరేట్‌లోని ప్రజావాణి మందిరంలో శనివారం వడ్డెర ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్డీఓ రాంచందర్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వడ్డెర ఓబన్న స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీఆర్వో ఎంఏ రషీద్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఉమాపతి, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రమంజలి దత్తు, మహిళా అధ్యక్షురాలు ఎర్ర మంజలి సత్యమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, సహాయ కార్యదర్శి గంగప్ప, కోశాధికారి కృష్ణ, నాయకులు వెంకట్రాములు, బాలరాజు, బసప్ప, బైరంకొండ రాములు, ఆశప్ప, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం పట్టణంలో సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం జిల్లాస్థాయి ఆటల పోటీలను ఎమ్మెల్యే క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం విద్యాపీఠం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందడమేగాక సమయపాలన అలవడుతుందన్నారు. సరస్వతి శిశుమందిరాలు చదువులోనే కాకుండా సమాజాన్ని తీర్చిదిద్దే గొప్ప సామాజిక కేంద్రాలుగా పని చేస్తున్నాయని వివరించారు. తాను శిశుమందిర్ విద్యార్థినని గర్వంగా ఉందని.. శిశుమందిరాలను అభివృద్ధి చేసేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి ఎల్లప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, దేవరింటి నర్సింహారెడ్డి, సరస్వతి శిశు మందిర్ నిర్మాణ అధ్యక్షుడు కొండయ్య, కృష్ణ మోహన్, రఘుప్రసన్నభట్, మల్లికార్జున్, మన్‌సాని వెంకటేశ్, కావలి వెంకటేశ్, నాగరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మాధవ రాజు, విశ్రాంత పీఈటీ గోపాలం, నాగార్జున, భాస్కర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు..
సంక్రాంతి సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఆధ్వర్యంలో సత్యసాయిబాబా మందిరం ఆవరణలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ముగ్గులు వేసిన పలువురికి బహుమతులు అందజేశారు.

న్యూస్‌రీల్

108 ఉద్యోగికి రాష్ట్రస్థాయి పురస్కారం



నారాయణపేట: మండలంలోని పేరపళ్లకు చెందిన రాజ్‌కుమార్‌కు 108 అంబులెన్స్‌లో ఉత్తమ సేవలు అందించినందుకుగాను రాష్ట్రస్థాయిలో రెండోసారి ఉత్తమ ఉద్యోగి అవార్డు దక్కింది. నియోనేటల్ అంబులెన్స్‌లో నవజాత శిశువును రక్షించినందుకు జీవీకే ఈఎంఆర్ఐ తెలంగాణ రాష్ట్ర 108 స్టేట్‌హెడ్ ఖలీద్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి రవికుమార్ శనివారం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను 108 జిల్లా అధికారి రాఘవేందర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, వారి కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

- ఎస్పీ యోగేష్ గౌతమ్



బాలకార్మికులతో ఆపరేషన్ స్మైల్ బృందం

నారాయణపేట: జిల్లాలో ఎవరైనా 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్–11 కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా జిల్లా పరిధిలో 37 మంది బాలకార్మికులను (17 బాలురు, 20 బాలికలు) గుర్తించి షెల్టర్ హోమ్‌కు తరలించామని ఆపరేషన్ స్మైల్ బృందం శనివారం ఎస్పీకి వివరించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థులను పాఠశాలలకు పంపిస్తామని.. పనిలో పెట్టుకున్న వారికి జరిమానా విధిస్తామన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైందని.. దానిని అనుభవించడం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. కొందరు పిల్లలు క్షణికావేశంలో తల్లిదండ్రులను వదిలి ఇంటికి దూరంగా ఉంటున్నారని.. దీనిని ఆసరాగా తీసుకుని వారితో ప్రమాదకర పనులు చేయిస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తప్పిపోయిన పిల్లలను దర్పన్ అప్లికేషన్ ద్వారా గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చదువుకొనేలా చూస్తామని తెలిపారు. జిల్లా పరిధిలో ఎవరైనా చిన్నారులను పనులకు పంపించినా, వెట్టిచాకిరీ చేయించినా వెంటనే 1098కి గాని లేదా 112, డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

మైలారం జాతరకు ప్రత్యేక బస్సులు

నారాయణపేట రూరల్: కర్ణాటకలోని యాద్గిర్ పట్టణ శివారులో ఉన్న మైలాపురం మల్లయ్య స్వామి జాతరకు తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందని నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సందర్భంగా జరిగే బండారు ఉత్సవం తదితర కార్యక్రమాలకు ఈ నెల 13, 14 తేదీల్లో జిల్లాకేంద్రం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని.. పట్టణ, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కంది క్వింటా రూ.8,855

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం తెల్ల కంది క్వింటా గరిష్టంగా రూ.8,855, కనిష్టంగా రూ.6,529 ధర పలికాయి. అలాగే ఎర్ర కంది రూ.8,303–రూ.6,230, వరి సోనారకం గరిష్టంగా రూ.2,478, కనిష్టంగా రూ.2,429, హంసరకం గరిష్ట, కనిష్ట ధరలు రూ.2,212 నమోదయ్యాయి.

శ్రీరామనామం..

- పాలమూరులో భక్తుల శ్రీరామ్ నినాదాలు
- పాతగంజిలో ఉట్టిపడిన ఆధ్యాత్మికం
- పాల్గొన్న వందలాదిమంది భక్తులు

వివరాలు 10లో..



క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


భవాని

కొల్లాపూర్ రూరల్: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని కుడికిల్ల గ్రామంలో ఆరేపల్లి భవాని(20)కి మూడు నెలల క్రితం పెబ్బేర్ మండలం పాతపల్లికి చెందిన రాజేందర్‌తో వివాహమైంది. శుక్రవారం సాయంత్రం పాతపల్లి నుంచి భర్తతో కలిసి తల్లిగారి ఊరు కుడికిల్లకు వచ్చింది. శనివారం ఉదయం భర్త గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వచ్చే సరికి తలుపులు లోపల గొళ్లెం పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా తలుపులు తీయక పోవడంతో ఇరుగు, పొరుగు వారితో కలిసి తలుపులు పగులగొట్టారు. ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ భవాని కనిపించింది. వెంటనే ఆమెను కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే చనిపోయింది. ఆమె తల్లి చెన్నమ్మ, బంధువులు బోరున విలపించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


భాస్కర్(ఫైల్)

చిన్నచింతకుంట: పురుగుమందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గూడూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. గూడూరుకి చెందిన మేదరి భాస్కర్(25) తల్లిదండ్రులు నాలుగేళ్ల క్రితం ఆనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి ఒంటరిగా జీవిస్తుండడంతో మనస్తాపం చెందాడు. ఈనెల 1వ తేదీన తన ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి వనపర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


వెంకట్రాములు (ఫైల్)

కోయిల్‌కొండ: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన గొల్ల వెంకట్రాములు (41) ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భార్య గొల్ల మంగమ్మ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. వివరాలు.. అభంగపట్నంకు చెందిన గొల్ల వెంకట్రాములు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉండటంతో అనారోగ్యం బారిన పడి ఆరు నెలలుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో నుంచి బయటికెళ్లి అదృశ్యమయ్యాడు. భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఎస్‌ఐ సెల్ నంబర్ 8712659338కు సమాచారమివ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జడ్చర్ల: జడ్చర్ల శివారులో శుక్రవారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాద సంఘటనపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు..హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళ్తున్న ట్రావెల్ బస్సు డ్రైవర్ షణ్ముకం ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసే సమయంలో వెనుక నుంచి ఓ పక్కగా ఢీకొట్టి అ వెంటనే రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కర్నూలుకు చెందిన ప్రయాణికుడు నూర్ అహ్మద్ (58)తో పాటు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన బస్సు క్లీనర్ రాజా ఉర్ఫ్ (55) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరితో పాటు బస్సులో ప్రయాణిస్తున్న శ్రీకాంత్, రమ్య, సింధు, సంతోష్, సుమలత, రాధా క్రిష్ణ, ఉమాదేవి,హేమమంజుల, దేవిక, మున్నస్వామి, అలివేల, ప్రతాజ్, వెంకటేష్, లక్ష్మి, సాయి ముఖేష్, రాఘవ క్రిష్ణ, రజిత, విశ్వనాథ్ గాయపడ్డారు. నిర్లక్ష్యంగా బస్సును నడిపి ప్రమాదానికి కారణమయిన బస్సు డ్రైవర్ షణ్ముకంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాలకు బాదేపల్లి ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై..

కోస్గి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీని, పోలీసులను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓవ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలు.. మండలంలోని సర్జఖాన్‌పేట్ కి చెందిన కృష్ణయ్యగౌడ్ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో సీఎం , కాంగ్రెస్ పార్టీని, పోలీసులపై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్‌మీడియాల్ వీడియో పెట్టాడు. అది వైరల్‌గా మారింది. ఈఘటనపై సర్జఖాన్‌పేట్ మాజీ సర్పంచ్ హరీశ్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఇదే విషయమై ఎస్‌ఐ బాల్‌రాజ్‌ను వివరణ కోరగా ఈ సంఘటన హైదరాబాద్‌లో జరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


తెలంగాణ-జమ్ముకశ్మీర్ జట్ల మధ్య బాలికల మ్యాచ్


హర్యానా-చండీఘర్ బాలికల మ్యాచ్

తెలంగాణ జోరు

వరుస 2 విజయాలతో సత్తా చాటిన బాలుర జట్టు

- శుభారంభం చేసిన రాష్ట్ర బాలికల జట్టు
- ఉత్సాహంగా సాగుతున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరుగుతున్న 68వ నేషనల్ స్కూల్‌గేమ్స్ అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణ బాలుర జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. శనివారం జరిగిన రెండోమ్యాచ్‌లో తెలంగాణ 21-9 పాయింట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై గెలుపొందింది. మొదటి అర్ధభాగంలో 9-3 పాయింట్ల ఆధిక్యంతో ఉన్న తెలంగాణ, రెండో అర్ధభాగంలో కూడా మెరుగ్గా ఆడి మ్యాచ్‌లో విజయం సాధించింది. అదేవిధంగా రాష్ట్ర బాలికల జట్టు 19-4 గోల్స్ తేడాతో జమ్ముకశ్మీర్‌పై గెలుపొందింది.

- బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ 24-24 తేడాతో సీబీఎస్‌ఈపై, గుజరాత్ 20-18 తేడాతో మహారాష్ట్రపై, ఉత్తరప్రదేశ్ 20-14 తేడాతో జమ్ముకశ్మీర్‌పై, రాజస్తాన్23-8 తేడాతో సీఐఎస్‌ఈపై, కేరళ 21-16 తేడాతో హిమాచల్‌ప్రదేశ్‌పై, డీఏవీ 30-14 తేడాతో సీబీఎస్‌సీడబ్ల్యూటపై, బిహార్ జట్టు 15-7 తేడాతో కర్ణాటకపై, కేవీఎస్19-11 తేడాతో పుదుచ్చేరిపై, చత్తీస్‌ఘడ్ జట్టు 22-14 తేడాతో విద్యాభారతిపై, త్రిపుర 12-7 తేడాతో అసోంపై, హర్యానా 22-10 గోల్స్ తేడాతో పుదుచ్చేరిపై, కర్ణాటక 13-4 తేడాతో లద్దాఖ్‌పై, చత్తీస్ఘర్17-13 తేడాతో మణిపూర్‌పై, చండీఘర్ 30-9 తేడాతో సీబీఎస్‌ఈపై, వెస్ట్‌బెంగాల్ 29-12 తేడాతో త్రిపురపై, పంజాబ్ 22-10 గోల్స్ తేడాతో ఐపీఎస్‌సీపై, మహారాష్ట్ర 24-13 తేడాతో ఒడిశాపై విజయం సాధించాయి.
- బాలికల విభాగంలో మహారాష్ట్ర 18-1 గోల్స్ తేడాతో ఐబీఎస్‌ఓ పై, బిహార్ 14-11తో ఢిల్లీపై, హిమాచల్‌ప్రదేశ్ 13-6తో మణిపూర్‌పై, సీబీఎస్‌ఈ 11-10తో కర్ణాటకపై, కేవీఎస్ 10-5 తేడాతో త్రిపురపై, చత్తీస్‌ఘర్ 13-10తో డీఏవీపై, సీబీఎస్‌ఈ 10-3తో లద్దాఖ్‌పై, వెస్ట్‌బెంగాల్ 11-4తో అసోంపై, రాజస్తాన్ 23-1తో ఐపీఎస్‌ఈపై, పుదుచ్చేరి16-5తో చండీఘర్‌పై, ఆంధ్రప్రదేశ్ 13-4తో జమ్ముకశ్మీర్‌పై, తమిళనాడు 19-7తో డీఏవీపై, వెస్ట్‌బెంగాల్ 12-6తో కేవీఎస్‌పై, కర్ణాటక 15-12తో మధ్యప్రదేశ్‌పై, హిమాచల్‌ప్రదేశ్ 11-1తో జార్ఖండ్‌పై, పంజాబ్ 13-12తో బిహార్‌పై, గుజరాత్ 16-10తో మహారాష్ట్ర జట్టుపై గెలుపొందాయి.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం: యెన్నం

క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల శనివారం రెండో మ్యాచ్‌లను ఆయన ప్రారంభించారు. క్రీడాజట్లను పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మహబూబ్‌నగర్ వేదికకావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. క్రీడాకారులకు కావలసిన అత్యవసర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రజనీకాంత్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎండీ జియావుద్దీన్, డాక్టర్ రవికుమార్, బాల్‌రాజు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం ఆయా క్రీడాజట్లను ఏఎస్పీలు రాములు, సురేష్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ వెంకటేశ్‌లు వేర్వేరుగా పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పీడీలు వేణుగోపాల్, ముకర్రం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి 'జోగుళాంబ' వార్షిక బ్రహ్మోత్సవాలు


అలంపూర్ క్షేత్రంలో కరపత్రాలను, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు. అలంపూర్ పట్టణంలోని జోగుళాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి మహోత్సవ కరపత్రాలను, ఆహ్వాన పత్రికలను జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల 2025 క్యాలెండర్‌ను శనివారం విడదల చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరై ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్ కుమార్‌లతో కలిసి కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, కరపత్రాలను భక్తుల ప్రచారార్థం ముందస్తుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, సరస్వతి, విశ్వనాథరెడ్డి, గోపాల్, జగదీశ్వర్‌గౌడ్, జగన్‌మోహన్ నాయుడు, జి. వెంకటేశ్వర్లు, కే. జయరాముడు, ఏ. వెంకటేశ్వర్లు, జి.పులెందర్, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే..

అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఎమ్మెల్యే విజయుడు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ అర్చక స్వాములతో కలిసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఈఓ శేషవస్త్రాలతో సత్కరించారు. వీరితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మార్మోగిన శ్రీరామనామం

- పాలమూరులో భక్తుల జైశ్రీరామ్ నినాదాలు
- పాతగంజిలో ఉట్టిపడిన ఆధ్యాత్మికం
- పాల్గొన్న వందలాదిమంది భక్తులు


ఆదిత్యపరాశ్రీస్వామి ప్రవచనం

స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం క్లాక్‌టవర్‌లో పాతగంజి వద్ద హైందవ శక్తిసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను వేపూరిగేరి ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పాతగంజి వరకు ఊరేగించారు. వేదపఠనం, 108 కలశాలతో శివలింగానికి అభిషేకం చేశారు. కార్యక్రమానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. క్లాక్‌టవర్ నుంచి పాతగంజి వరకు రహదారి భక్తులతో కిటకిటలాడింది. వేదికపై శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సంకీర్తనా గానం అలరించింది. భక్తుల హనుమాన్ చాలీసా పారాయణంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికం వెల్లివిరిసింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

హాజరైన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

మహోత్సవానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హైందవ శక్తిసేవా సంస్థ సభ్యులు శ్రీనివాస్, కమల్‌కిషోర్, రమేశ్, బాలకృష్ణ, బాల్‌రాజు, సంతోష్, సతీష్, సాయిలు, సాయి, అమర్, గణేష్, భాస్కర్, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్, ప్రజా ప్రతినిధులు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మానికి నిలువెత్తు నిదర్శనం శ్రీరాముడు

- ఆదిత్యపరాశ్రీస్వామి

ధర్మానికి నిలువెత్తు నిదర్శనం శ్రీరాముడు అని, అంబాత్రయ క్షేత్రం ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. మహోత్సవంలో పాల్గొని ఆయన ప్రవచనం చేశారు. ఈ రోజు ఎంతో పవిత్రమైందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిందూవులంతా ఐక్యంగా సంఘటితం కావాలని కోరారు. శ్రీరాముడి జీవితంపై ప్రముఖ ధార్మిక వేత్త పల్లెర్ల రాంమోహనరావు ప్రసంగించారు. శ్రీరాముడి ధర్మబద్ధమైన పాలన అందించినట్లు తెలిపారు. రాముడు చూపిన సత్యం, ధర్మం బాటలో నడుద్దామని కోరారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టించాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు పరుస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయగా.. మందకృష్ణ మాదిగ వర్గీకరణ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాకూడదని మాలలతో వ్యతిరేక ఉద్యమం చేయిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ అధ్యక్షతన నిర్వహించిన మాదిగ విద్యార్థి యువగర్జన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వర్గీకరణ చేయడం మందకృష్ణ, బీజేపీకి ఇష్టం లేదన్నారు. బీజేపీ డైరెక్షన్‌లో మందకృష్ణ పనిచేసి మాదిగ సమాజాన్ని మనువాద భావజాలంతో పాడు చేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయడానికి అనేక దశల్లో ప్రక్రియ మొదలుపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంపై లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకల కార్యక్రమం ఎందుకు అని ప్రశ్నించారు. మందకృష్ణకు మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే నరేంద్రమోదీని ఒప్పించి పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టించాలని, అది చేయకుండా మాదిగలపై కపట ప్రేమ కురిపించడం సిగ్గుచేటు అన్నారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో చేపట్టే మాదిగ విద్యార్థి యువగర్జన సభను జిల్లా నుంచి వేలాదిగా మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్, మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి దేవన్న, నాయకులు సురేష్, రమేష్, కృష్ణ, అరుణ్, రవి, నర్సింహులు, మల్లేష్, రంగస్వామి, వెంకట్రాములు, చెన్నయ్య, యాదగిరి, విజయ్, గోపాల్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మదనాపురం: అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆత్మకూరు వైపు నుంచి కొత్తకోటకు అశోక్ లీలాండ్ మినీ వాహనంలో 74 సంచుల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, శనివారం ఉదయం తెల్లవారుజామున మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులకు పట్టుకున్నారు. తక్షణమే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను విచారణ చేశారు. దుప్పల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ మహేష్ బియ్యాన్ని షాద్‌నగర్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ బియ్యమే అని నిర్ధారించడంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

- ఆత్మకూర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున గాంధీచౌక్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది వాహనాల తనిఖీలో రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాహనంతో పాటు 18 సంచుల రేషన్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సివిల్‌సప్లయ్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హ్యాండ్‌బాల్ కోచింగ్ ప్రస్థానం

మహబూబ్‌నగర్ నుంచే మొదలైంది

- అత్యున్నత శిక్షణతో అంతర్జాతీయస్థాయికి
- జాతీయ హ్యాండ్‌బాల్ కోచ్ డాక్టర్ ఎం.రవికుమార్


ఇండియన్ కోచ్ డాక్టర్ ఎం.రవికుమార్

సాక్షి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ క్రీడలు: హ్యాండ్‌బాల్ కోచ్‌గా తాను మొదట మహబూబ్‌నగర్ డీఎస్‌ఏలో చేరానని, కోచ్ ప్రస్థానంలో జిల్లాను మరిచిపోలేనని జాతీయ హ్యాండ్‌బాల్ కోచ్, ఎల్‌బీ స్టేడియం ఏఓ డాక్టర్ ఎం.రవికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో జరుగుతున్న అండర్-17 ఎస్‌జీఎఫ్ నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీకి వచ్చిన ఆయన శనివారం సాక్షితో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆయన మాటల్లోనే...'1999లో మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాశాఖలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా నియమాకమై 2007 వరకు పనిచేశాను. ఇక్కడ క్రీడాకారుల్లో పోటీ, కష్టపడేతత్వం ఉంది. దీంతో అనతికాలంలోనే నైపుణ్యంగల క్రీడాకారులను వెలికితీసే అవకాశం లభించింది. మొదట్లో హ్యాండ్‌బాల్‌పై ఆసక్తి కనబరిచేవారు కాదు. ప్రతి పాఠశాలకు వెళ్లి ఈ క్రీడ గురించి వివరించి చిన్నారులను ప్రోత్సహించాం. రెండు, మూడేళ్లలోనే మహబూబ్‌నగర్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో సత్తాచాటారు. హైదరాబాద్‌లో కోచ్ విధులు నిర్వర్తిస్తూనే 2008లో జర్మనీలో హ్యాండ్‌బాల్‌పై అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ తీసుకున్నా. 2012, 2014లో హంగేరి, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో కూడా శిక్షణ తీసుకున్నాను. ఏషియన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టుకు పలుసార్లు కోచ్‌గా వ్యవహరించాను. ఉస్మానియా యూనివర్సిటీలో 'హ్యాండ్‌బాల్ స్పోర్ట్స్ సైకాలజీపై పీహెచ్‌డీ చేయగా 2005లో డాక్టరేట్ పట్టా పొందాను. క్రీడల్లో అత్యున్నత శిక్షణ లభిస్తే క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదుగుతారు. ముఖ్యంగా అకాడమీలు, హాస్టళ్ల ఏర్పాటుతో క్రీడాకారులను మేటిగా తీర్చిదిద్దవచ్చు.'

కురుమూర్తి గిరుల్లో గోవిందనామస్మరణ


కురుమూర్తి గిరులలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

- వైభవంగా గిరి ప్రదక్షిణలు
- హాజరైన ఎమ్మెల్యేలు, వేలాది భక్తులు
- వివిధ ధార్మిక సంఘాల నాయకులు, స్వామిజీలు


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు జీఎమ్మార్, మేఘారెడ్డి

చిన్నచింతకుంట: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలో వెలిసిన కురుమూర్తి క్షేత్రం వద్ద శనివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, తూడి మెగారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డిలు, అమ్మాపురం సంస్థానాదీశులు రాజ శ్రీరాంభూపాల్ హాజరై జెండాఊపి ప్రారంభించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తోపాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, హిందు బంధువులు, విశ్వహిందు పరిషత్ సభ్యులు, వివిధ ధార్మిక సంఘాల నాయకులు, స్వామిజీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కురుమూర్తి స్వామి ఆలయ రాజగోపురం నుంచి స్వామి వారి ఆలయ కలశపూజ మండపం మీదుగా కురుమూర్తి గిరుల వెనక భాగం నుంచి అమ్మాపురం మీదుగా జతరమైదానం వరకు 5కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేశారు. దీంతో కురుమూర్తి గిరులలో గోవింద నామస్మరణ మార్మోగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కురుమూర్తి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.70 ఏళ్ల నుంచి ఏ ఒక్క నాయకుడు స్వామి వారి దర్శనానికి రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి మొట్టమొదటి సారిగా స్వామివారిని దర్శంచుకున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి 110 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి, సాదు సంతు పరిషత్ రాష్ట అధ్యక్షులు శంకర్ స్వామి, రగోత్తం స్వామి, విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు రాచాల జనార్దన్, నరేందర్, చంద్రయ్య, హనుమంతు, శివయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వరిగడ్డి డీసీఎం దగ్ధం

- రూ.6 లక్షలు ఆస్తి నష్టం


వరిగడ్డితో పాటు కాలిపోయిన డీసీఎం

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ-సదగోడు సమీపంలో శనివారం మధ్యాహ్నం వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న డీసీఎంకు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. గడ్డితో పాటు డీసీఎం కాలిపోయిన సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో దాదాపుగా రూ.6 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది అంచనా వేశారు. అచ్చంపేట మండలం పులిజాలకు చెందిన బస్వయ్య సదగోడుకు చెందిన శ్యాంసుందర్ రెడ్డి వద్ద రూ. 20 వేలకు వరిగడ్డిని ఖరీదు చేశాడు. గడ్డిని తీసుకెళ్లడానికి మండలంలోని తాడూరుకు చెందిన కాకనూరు ఆంజనేయులు డీసీఎంను కిరాయికి తీసుకొచ్చాడు. పొలంలో వరిగడ్డి కట్టలను నింపుకొని వస్తుండగా గ్రామ సమీపంలో రోడ్డుపై ఉన్న కరెంట్ వైర్లు తాకడంతో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన పరిసర ప్రాంతంలో ఉన్న రైతులు తమ శక్తి మేర నీళ్లు చల్లినా ఫలితం లేకపోయింది. గడ్డితో పాటు డీసీఎం క్యాబిన్ కొంతమేర కాలిపోయింది. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని కాలిపోతున్న డీసీఎం మంటలు ఆర్పారు.